ఐడీపీఎల్-జగద్గిరిగుట్ట రోడ్డులోని ఏపీహెచ్‌బీ కాలనీ ఎంట్రన్స్ పక్కనే షెడ్డు ఏర్పాటు చేసిన దృశ్యం



దర్గాగా ప్రభుత్వ స్థలం కబ్జా.!

- షెడ్డు వేసిన అక్రమణదారులు
- మీనమేషాలు లెక్కిస్తున్న సర్కిల్ అధికారులు

రంగారెడ్డినగర్: జీహెచ్ఎంసీ పరిధిలోని ఒక్కొక్కటిగా ప్రభుత్వ స్థలాలు కబ్జా చెరలో చిక్కుకుంటున్నా అధికారులు మీనమేషాలు లెక్కిస్తున్నారు. ప్రధాన రహదారుల వెంబడి ఉన్న స్థలాల్లో ఇప్పటికే డబ్బాలు ఏర్పాటు చేసి వ్యాపారులు కొనసాగిస్తుండగా తాజాగా లక్షలాది రూపాయలు విలువ చేసే స్థలాన్ని కబ్జా చేసేందుకు కొందరు వ్యక్తులు పన్నాగం పన్నారు.. వివరాల్లోకి వెళితే.. రంగారెడ్డినగర్ డివిజన్ పరిధిలోని ఏపీహెచ్‌బీ కాలనీ ఆర్చ్‌కు ఆనుకుని ఐడీపీఎల్- జగద్గిరిగుట రోడ్డులో ఉన్న వంద గజాల స్థలంపై కొందరి కన్ను పడింది.. ఈ ప్రాంతంలో గజం స్థలం విలువ రూ.1 లక్ష పైనే ఉంది. అనుకున్నది తడవుగా రాత్రికి రాత్రి సదరు స్థలాన్ని చదును చేసి దాదాపు 100 గజాల స్థలంలో పక్కా షెడ్డు నిర్మాణం పూర్తి చేశారు. ప్రధాన రోడ్డు వెంబడే ఈ తతంగం జరుగుతున్నా సర్కిల్ అధికారుల కళ్లను కనిపించకపోవడం గమనార్హం. అధికారులు ఇప్పటికైనా స్పందించకుంటే సదరు వ్యక్తులు రెండు, మూడు రోజుల్లో సదరు కబ్జా స్థలం చుట్టూ ప్రహరీ ఏర్పాటు చేసి శాశ్వతంగా సొంతం చేసుకునే పనిలో ఉన్నారు. ఈ వ్యవహారంపై టౌన్ ప్లానింగ్ అధికారులు స్పందించి అక్రమణలను తొలగిస్తారో.. లేకుంటే షరా మామూలుగా ప్రభుత్వ స్థలాన్ని కబ్జాదారులకు సమర్పిస్తారో వేచి చూడాల్సిందే.

నిర్లక్ష్యం.. నిరుపయోగం

- మూలనపడ్డ జిమ్ సామగ్రి
- పట్టించుకోని సంబంధితశాఖ అధికారులు



భగత్‌సింగ్‌నగర్ మోడ్రన్ జిమ్‌లోని ఓ గదిలో ఉంచిన జిమ్ సామాను(ఫైల్)

చింతల్: అధికారుల నిర్లక్ష్యానికి ప్రజాప్రతినిధులు సైతం తోడు కావడంతో పదేళ్లు కావస్తున్నా ఒక జిమ్‌ను ఏర్పాటు చేయలేకపోవడం వారి పనితీరుకు నిదర్శనంగా మారింది. తెలంగాణ ఏర్పడిన అనంతరం 2015–16లో యువత కోసం ఆయా బస్తీలు, కాలనీల్లో ప్రభుత్వం గ్రేటర్ హైదరాబాద్‌లో ఒక్కో డివిజన్‌కు ఒక జిమ్ చొప్పున రూ.7లక్షల నిధులను ఆధునిక జిమ్‌ల ఏర్పాటు కోసం కేటాయించిన విషయం తెలిసిందే. కుత్బుల్లాపూర్, గాజులరామారం సర్కిళ్ల పరిధిలోని ఎనిమిది డివిజన్లకు గాను రూ.50లక్షల నిధులు వెచ్చించి 8 చోట్ల జిమ్‌లను ఏర్పాటు చేశారు. ఒక్కో డివిజన్‌లో సంబంధిత కార్పొరేటర్ ఆధ్వర్యంలో మోడ్రన్ జిమ్‌లను ఏర్పాటు చేసి స్థానిక యువతకు నామ మాత్రపు ఫీజుతో అందుబాటులోకి తీసుకువచ్చారు.

తొమ్మిదేళ్లుగా పత్తాలేని జిమ్..

చింతల్ డివిజన్‌కు కేటాయించిన జిమ్‌ను భగత్‌సింగ్‌నగర్ కమ్యూనిటీ హాలులో ఏర్పాటు చేసేందుకు అధికారులు సిద్ధం చేశారు. కానీ ఆ సమయంలో కమ్యూనిటీహాల్ శిథిలావస్థకు చేరడంతో దానికి మరమ్మతులు చేపట్టిన అనంతరం ప్రారంభించేందుకు అంచనాలు రూపొందించి రూ.5లక్షల నిధులతో మరమ్మతులు చేపట్టారు. పనులు పూర్తి చేసి కమ్యూనిటీ హాలులో జిమ్‌ను ప్రారంభించేనాటికి అక్కడ మోడ్రన్ ఫంక్షన్‌హాల్ నిర్మాణానికి శంకుస్థాపన చేయడం చకచకా జరిగిపోయి ఫంక్షన్‌హాలు ప్రారంభానికి 5 సంవత్సరాలు గడిచిపోయాయి. దీంతో ఏడేళ్లుగా జిమ్ ప్రారంభానికి నోచుకోకపోవడంతో అధికారులు జిమ్ సామానును ఓ గదిలో ఇష్టానుసారంగా పడేయడంతో అవి కొంత మేర ధ్వంసమయ్యాయి. అనంతరం మోడ్రన్ ఫంక్షన్‌హాల్ పక్కనే ఓ గది నిర్మాణం చేయగా అది కూడా బస్తీ దవాఖానాగా మారిపోయింది.

జిమ్ సామాను ఎక్కడ..?

దీంతో గత కొన్నేళ్లుగా ప్రారంభానికి నోచుకోక పోయిన రూ.8 లక్షలు విలువ చేసే జిమ్ సామాను రోజురోజుకు మాయమైనట్లు గతంలో ఆరోపణలు వినిపించాయి. భగత్‌సింగ్‌నగర్‌లో ఉండగా కొంత మంది బీఆర్ఎస్ నేతల ఇళ్లల్లో జిమ్‌కు సంబంధించిన వస్తువులు దర్శనమిచ్చినట్లు ఆరోపణలు వినిపించాయి. చింతల్ డివిజన్‌కు కేటాయించిన జిమ్ ఏర్పాటు భగత్‌సింగ్‌నగర్‌లో ఏర్పాటు చేయడం వీలు కాకపోతే ఇతర బస్తీలు, కాలనీలో ఏర్పాటు చేసే వెసులుబాటు ఉన్నా అధికారులు ఆ దిశగా చర్యలు తీసుకోకపోవడంతో జిమ్ సామాను నేడు ప్రశ్నార్థకంగా మారింది. అందే కాకుండా డివిజన్‌లో ఇంకెక్కడైనా జిమ్ ఏర్పాటు చేసి ఉన్నట్లయితే నేడు యువతకు ఎంతో ఉపయోగకరంగా ఉండేదని పలువులు వాపోతున్నారు. కాగా జిమ్ సామాను బీఆర్ఎస్ నేతల ఇళ్లల్లో ఉండడం కూడా ఓ కారణంగా పేర్కొంటూ అధికారులు సైతం మరో ప్రాంతంలో ఏర్పాటు చేయక పోవడంపై స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మాయమైన జిమ్ సామగ్రిపై ఎవరు సమాధానం చెబుతారని, ప్రభుత్వ నిధుల దుబారాపై దర్యాప్తు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

దత్త క్షేత్రంలో ఎమ్మెల్సీ పూజలు



గాణగాపూర్‌లోని దత్త క్షేత్రంలో తీర్థప్రసాదాలు స్వీకరిస్తున్న ఎమ్మెల్సీ శంభీపూర్‌రాజు

కుత్బుల్లాపూర్: మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ శంభీపూర్‌రాజు ఆదివారం కర్నాటక రాష్ట్రం గానుగాపూర్‌లోని శ్రీదత్తాత్రేయ స్వామిని దర్శించుకున్నారు. ఆలయంలో పూజలు నిర్వహించిన ఆయనకు వేదపండితులు తీర్థప్రసాదాలు అందజేసి ఆశీర్వదించారు.

గురుకులాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి



కైసర్‌నగర్‌లో గురుకుల పాఠశాల, కళాశాలలో ప్రవేశాలపై అవగాహన కల్పిస్తున్న సమీర్‌ఖాన్, తదితరులు

జగద్గిరిగుట్ట: గురుకులాలను మైనార్టీ, ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని టీపీసీసీ మైనార్టీ డిపార్ట్‌మెంట్ స్టేట్ జాయింట్ కన్వీనర్ సమీర్‌ఖాన్ అన్నారు. ఆదివారం గాజులరామారం డివిజన్ కైసర్‌నగర్‌లో టీఎంఆర్ స్కూల్, బాలానగర్ బాలుర జూనియర్ కళాశాలలో ప్రవేశానికి దరఖాస్తు చేసుకునే విషయమై అవగాహన కల్పించారు. ఫిబ్రవరి 5 నుంచి 8వ తేదీ వరకు రాష్ట్ర గురుకులాల వైబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. గురుకులాల్లో విద్యనభ్యసించే విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధిస్తున్నారని అన్నారు. వారికి రాష్ట్ర ప్రభుత్వం ఉచిత వైద్యంతో పాటు వసతి, పౌష్టికాహారాన్ని అందజేస్తూ అనుభవజ్ఞులైన బోధనా సిబ్బందితో విద్యాబోధన అందిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో గాజులరామారం డివిజన్ టీపీసీసీ మైనార్టీ డిపార్‌మెంట్ ప్రెసిడెంట్ ఎండి లాయక్ తదితరులు పాల్గొన్నారు.

పట్టించుకోకుంటే ఆత్మహత్యే శరణ్యం

- ఉద్యమకారుడు రాజుచారి
- పింఛన్, డబుల్ బెడ్రూమ్‌కు దరఖాస్తు చేసుకున్నా రాలేదని ఆవేదన



కేటీఆర్‌కు వినతి పత్రం ఇచ్చిన అనంతరం దండం పెడుతున్న రాజుచారి



రాజుచారి

సుభాష్‌నగర్: తెలంగాణ ఉద్యమంలో కుటుంబాన్ని సైతం లెక్కచేయకుండా పార్టీలో తిరిగా.. ప్రత్యేక రాష్ట్రం కోసం రెండుసార్లు ఆత్మహత్యకు యత్నించి చావు అంచు వరకు వెళ్లి వచ్చానని సూరారం కాలనీకి చెందిన రాజుచారి అన్నారు. బహదూర్‌పల్లిలో శనివారం జరిగిన బీఆర్ఎస్ పార్టీ మల్కాజ్‌గిరి పార్లమెంటరీ కార్యకర్తల సన్నాహక సమావేశానికి కేటీఆర్ వస్తున్నారని తెలుసుకొని ఆయనకు తాను ఎదుర్కొన్న సమస్యను వినతి పత్రం ఇచ్చాడు. ఈ సందర్భంగా రాజుచారి మాట్లాడుతూ.. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం కోసం రెండుసార్లు ఆత్మహత్యయత్నానికి పాల్పడ్డానని అన్నారు. ప్రస్తుతం సర్వస్వం కోల్పోయానని తెలిపారు. బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చిన తర్వాత పింఛన్, డబల్ బెడ్‌రూమ్ కోసం ఎన్నిసార్లు దరఖాస్తు పెట్టుకున్నా ఇంతవరకు సమస్య పరిష్కారం కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఒకవేళ నా సమస్య పరిష్కారం కాకుంటే ఇక నాకు చావే శరణ్యమని విలపించాడు.

క్షవరుడిపై కానిస్టేబుల్ దాడి



దాడిలో గాయపడిన శ్రీను

జీడిమెట్ల: క్షవరుడిపై పోలీస్ కానిస్టేబుల్ దాడి చేసి గాయపరిచిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. జీడిమెట్ల పోలీస్ స్టేషన్ పరిధిలోని బాపునగర్‌కి చెందిన శ్రీను స్థానికంగా సెలూన్‌ను ఏర్పాటు చేసుకున్నాడు. అతను సెలూన్ ముందు భూగర్భ డ్రైనేజీ పనులను నిర్వహిస్తున్నారు. దీంతో అటుగా రాకపోకలు సాగించేవారు అతని సెలూన్ ముందు నుంచే వెళ్లాల్సి వస్తోంది.

◆ శనివారం సాయంత్రం జీడిమెట్ల పీఎస్‌లో కానిస్టేబుల్‌గా పని చేస్తున్న శ్రీనివాస్‌గౌడ్ కూడా అదే మార్గంలో వెళ్తుండగా ఇటు రావొద్దంటూ శ్రీను సూచించారు. మరో దారి లేదని ఇక్కడి నుంచే వెళ్తానని కానిస్టేబుల్ చెప్పడంతో ఇరువురి మధ్య మాటా మాటా పెరిగింది. దీంతో సహనం కోల్పోయిన కానిస్టేబుల్ శ్రీనివాస్‌గౌడ్ కొట్టడంతో సెలూన్‌కు అమర్చిన గ్లాస్‌ను ఢీకొట్టి కింద పడ్డాడు. ఈ ఘటనలో అతని తలకు గాయమైంది. దీంతో బాధితుడు స్టేషన్‌కు వెళ్లి జరిగిన ఘటనపై ఫిర్యాదు చేశాడు.

◆ నాయీబ్రాహ్మణ సంఘం ప్రతినిధులు కొంత మంది కలుగజేసుకొని ఇద్దరి మధ్య రాజీ కుదిరించి ఫిర్యాదును వెనక్కి తీసుకునేలా చేశారు. దాడి విషయంలో ఆదివారం సామాజిక మాధ్యమాల్లో వైరల్ కావడంతో పోలీస్ ఉన్నతాధికారుల దృష్టికి వెళ్లింది. ఉన్నతాధికారుల సూచన మేరకు పోలీసులు 323 సెక్షన్ కింద కేసు నమోదు చేశారు.

ప్రజా సంక్షేమానికి పెద్దపీట



కొలన్ హన్మంతరెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరిన ప్రగతినగర్ 22, 23 డివిజన్ వాసులు

నిజాంపేట్: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సారథ్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆరు గ్యారంటీలకు ఆకర్షితులై పలువురు పార్టీలో చేరుతున్నారని కుత్బుల్లాపూర్ పార్టీ ఇన్‌చార్జ్ కొలన్ హన్మంతరెడ్డి అన్నారు. ఆదివారం నిజాంపేట్ కార్పొరేషన్ ప్రగతినగర్ 22, 23 డివిజన్లకు చెందిన పలువురు కొలన్ హన్మంతరెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సంక్షేమానికి పెద్దపీట వేస్తూ ఆరు గ్యారంటీలను ప్రవేశపెట్టిందని, ఈ గ్యారంటీలు ప్రతి ఒక్కరికి అందేలా కార్యకర్తలు కృషి చేయాలన్నారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో మల్కాజ్‌గిరి ఎంపీ స్థానాన్ని కాంగ్రెస్ కైవసం చేసుకోవడం ఖాయమని ఆయన జోష్యం చెప్పారు. కాంగ్రెస్ సీనియర్ నాయకుడు కొలన్ శ్రీనివాస్ రెడ్డి, నిజాంపేట్ కార్పొరేషన్ అధ్యక్షుడు కొలన్ రాజశేఖర్ రెడ్డి, కార్పొరేషన్ మహిళా అధ్యక్షురాలు ఇందిరా, రమేష్, అరవింద్, వీరబాబు, టేకుల ప్రవీణ్ రెడ్డి, మహేష్, శ్రీశైలం యాదవ్, రఫాత్, అమృత రావు తదితరులు ఉన్నారు.

నల్లపోచమ్మ, శివాలయాల నూతన కమిటీల ఏర్పాటు



రాజీవ్‌గృహకల్ప శివాలయం, నల్లపోచమ్మ ఆలయ నూతన కమిటీ సభ్యులతో కొలన్ శ్రీనివాస్‌రెడ్డి

నిజాంపేట్: నిజాంపేట మున్సిపల్ కార్పొరేషన్ రాజీవ్ గృహకల్పలోని శివాలయం, నల్లపోచమ్మ దేవస్థానాల నూతన కమిటీని ఆదివారం ఎన్నుకున్నారు. దేవస్థానం కమిటీ చైర్మన్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు కొలను శ్రీనివాస్‌రెడ్డి సమక్షంలో ఈ కమిటీ ఎంపిక జరిగింది. అధ్యక్షుడిగా పితాని శ్రీనివాస్‌రావు, ప్రధాన కార్యదర్శిగా ముద్దుకుప్పల కుమార్‌రెడ్డి, ఉపాధ్యక్షులుగా లక్ష్మణ్, రామచందర్‌నాయక్, సంయుక్త కార్యదర్శిగా వరికుప్పల దశరథ్, కోశాధికారిగా ముంగండ వెంకటేశ్వరరావు, కార్యవర్గ సభ్యులుగా దాలినాయుడు, నర్మద, హైమవతి, సరిత, రామోజీరావు, భిక్షపతి, వెంకటేష్ తదితరులు నియమితులయ్యారు. ఆలయ అభివృద్ధికి నూతన కమిటీ సభ్యులు కృషి చేయాలని కొలన్ శ్రీనివాస్‌రెడ్డి కోరారు.

మెట్రో కనెక్టివిటీని మేడ్చల్ వరకు పొడిగించాలి



ఫ్లెక్సీతో మేడ్చల్ మెట్రో సాధన సమితి సభ్యులు

కుత్బుల్లాపూర్: రాష్ట్ర ప్రభుత్వం రెండో దశ మెట్రో రైలు కనెక్టివిటీని మేడ్చల్ వరకు పొడిగించాలని ఆదివారం కొంపల్లిలో మేడ్చల్ మెట్రో సాధన సమితి సభ్యులు ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా సభ్యులు మాట్లాడుతూ.. సుచిత్ర, కొంపల్లి, మేడ్చల్ ప్రాంతంలో అనేక కళాశాలలు, షాపింగ్ మాల్స్, గేటెడ్ కమ్యూనిటీలు, మల్టీప్లెక్స్‌లు ఉన్నాయని అన్నారు. కాని రాష్ట్ర ప్రభుత్వం మెట్రో రెండో దశలో తమ ప్రాంతాన్ని విమర్శించడం తగదన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మెట్రో రైలును మేడ్చల్ వరకు పొడిగించి ఈ ప్రాంత అభివృద్ధికి సహకరించాలని కోరారు.

ముగిసిన జాతీయస్థాయి జూనియర్ కబడ్డీ పోటీలు



నిజాంపేట్: కాసాని కౌసల్య ముదిరాజ్ మెమోరియల్ 49జూనియర్ నేషనల్ కబడ్డీ చాంపియన్‌షిప్–2024 ఆదివారం ముగిశాయి. బాచుపల్లిలో నాలుగు రోజులుగా కొనసాగుతున్న పోటీల్లో 29 రాష్ట్రల నుంచి మొత్తం 60 పాల్గొన్నాయి. ఆదివారం రాత్రి బాలికల విభాగంలో తమిళనాడు, ఎస్ఏఐ (స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా) జట్ల మధ్య జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో ఎస్ఏఐ జట్టు గెలిచింది. అదే విధంగా బాలుర విభాగంలోనూ ఎస్ఏఐ జట్టు విజయం సాధించింది. ఈ సందర్భంగా కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్ విజేత జట్లకు ట్రోఫీని అందజేశారు. ఈ కార్యక్రమంలో అమెచ్యూర్ కబడ్డీ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఉపాధ్యక్షుడు కాసాని వీరేశ్‌ముదిరాజ్, కార్పొరేటర్లు కాసాని సుధాకర్, బాలాజీ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి స్పందన

రంగారెడ్డినగర్: గాంధీనగర్‌కు చెందిన స్వామి వివేకానంద్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పరిమిత ఉమెన్ అండ్ కిడ్స్ ఆస్పత్రి సౌజన్యంతో ఆదివారం రంగారెడ్డినగర్ డివిజన్ పరిధి గాంధీనగర్‌లోని సామాజిక భవనంలో ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. గైనకాలజిస్ట్ డాక్టర్ అవిన, డాక్టర్ శ్రావణిలు 200 మందికి పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు.



మెగా హెల్త్ క్యాంప్



వాసిరెడ్డి హెల్త్‌కేర్ ఫౌండేషన్ నిర్వాహకులను అభినందిస్తున్న డిప్యూటీ మేయర్ ధన్‌రాజ్‌యాదవ్

నిజాంపేట్: వాసిరెడ్డి హెల్త్ కేర్ ఫౌండేషన్, లైఫ్ లైన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం నిజాంపేట్ విజ్ఞాన్ స్కూల్‌లో మెగా హెల్త్ క్యాంప్, రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. నిజాంపేట్ కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ ధన్‌రాజ్‌యాదవ్ ముఖ్య అతిథిగా హాజరైన శిబిరాలను ప్రారంభించారు. ఈ శిబిరంలో బీపీ, డయాబెటీస్, ఈసీజీ, 2డీ–ఈకో, కంటి పరీక్షలు, కాల్షియం, దంత తదితర పరీక్షలు చేశారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం వరకు కొనసాగిన శిబిరంలో పెద్ద సంఖ్యలో స్థానిక ప్రజలు పాల్గొని పరీక్షలు చేయించుకున్నారు. ఈ శిబిరంలో కార్పొరేషన్ డాక్టర్ వాసిరెడ్డి, లైఫ్ లైన్ ఫౌండేషన్ సభ్యులు రామారావు, డాక్టర్ స్వాన్ తదితరులు పాల్గొన్నారు.

మేనత్త స్థలం కాజేయడానికి యత్నం

మేనల్లుడిపై కేసు నమోదు చేసిన జీడిమెట్ల పోలీసులు



నిందితుడు ప్రత్యూష్



దీనావస్థలో బాబులాల్, స్వరూప దంపతులు

జీడిమెట్ల: మానసిక వికలాంగురాలైన మేనత్త స్థలాన్ని కాజేసేందుకు యత్నిస్తున్న మేనల్లుడిపై జీడిమెట్ల పోలీసులు కేసు నమోదు చేశారు. న్యూషాపూర్‌నగర్‌కు చెందిన రిటైర్డ్ ఉద్యోగి బాబులాల్(82), స్వరూప(58)లు భార్యాభర్తలు. స్వరూప మానసిక వికలాంగురాలు కావడంతో వివాహ సమయంలో ఆమె తండ్రి పురుషోత్తం 250 గజాల స్థలాన్ని రిజిస్టర్ చేయడంతో పాటు 10 తులాల బంగారాన్ని ఇచ్చాడు. అయితే స్థలానికి సంబంధించి డాక్యుమెంట్లను తన పెద్ద కుమారుడు దయానంద్ వద్ద ఉంచాడు.

◆ ఈ క్రమంలో గత 30 సంవత్సరాలుగా స్వరూప ఆస్తికి సంబంధించిన డాక్యుమెంట్లను ఇవ్వకుండా కాజేయాలని పథకం పన్నిన పురుషోత్తమ్ తన కుమారుడు ప్రత్యూష్‌ను స్వరూప ఆస్తికి గార్డియన్‌గా నియమించాడు. అద్దె ఇంట్లో ఉంటున్న వృద్ధ దంపతులకు అద్దె చెల్లించడం గగనమైంది. ఈ క్రమంలో స్వరూప చికిత్స నిమిత్తం డబ్బులు లేకపోవడంతో పలుమార్లు బాబులాల్ తమ బావమరిది దచయానంద్‌ను స్థలానికి సంబంధించిన డాక్యుమెంట్లు ఇస్తే విక్రయించి ఆమెకు మెరుగైన చికిత్స చేయిస్తానని చెప్పినా తప్పించుకునే ధోరణిని అవలంభించాడు. ఎట్టకేలకు రాజీకి వచ్చిన పురుషోత్తమ్ డాక్యుమెంట్లను ఇచ్చేంత వరకు నెలకు రూ.15 వేలు ఇచ్చేందుకు అంగీకరించి మాట తప్పాడు.

◆ ఈ క్రమంలో స్థల డాక్యుమెంట్లతో పాటు బంగారాన్ని ఇవ్వాలని కోరుతూ దయానంద్ ఇంటి ముందు శాంతియుతంగా ధర్నా కూడా చేపట్టారు. ఇటీవల స్వరూపకు గార్డియన్‌గా ఉన్న మేనల్లుడు ప్రత్యూష్ వృద్ధ దంపతులు ఉంటున్న గది వద్దకు వచ్చి మరోసారి స్థల డాక్యుమెంట్లు అడిగితే చంపుతానని బెదిరింపులకు దిగాడు. చుట్టు పక్కల వారు అతడిని అడ్డుకుని ప్రశ్నిస్తే అక్కడ నుంచి పరారయ్యాడు. ఇప్పటి వరకు స్వరూపకు గార్డియన్‌గా ఉన్నా ఆమె ఆరోగ్య పరిస్థితిపై పట్టించుకున్న పాపాన పోలేదని, ప్రత్యూష్, అతని తండ్రి దయానంద్‌లతో తమకు ప్రాణహాని ఉందన్నారు. తన భార్యకు మెరుగైన చికిత్స అందించేందుకు స్థల డాక్యుమెంట్లను తమకు ఇప్పించాలని కోరుతూ బాబులాల్ జీడిమెట్ల పోలీసులను ఆశ్రయించగా కేసు నమోదు చేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రి తమ దయనీయ పరిస్థితిని అర్థం చేసుకుని న్యాయం జరిగేలా చూడాలని బాధితులు కోరుతున్నారు.

ఆటో డ్రైవర్ల సమస్యలపై దృష్టి సారించాలి



దుండిగల్ కౌన్సిల్ శంకర్‌నాయక్‌ను కలిసిన ఆటో డ్రైవర్లు

దుండిగల్: ఆటో డ్రైవర్లు ఎదుర్కొంటున్న సమస్యలపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించాలని దుండిగల్ మున్సిపల్ కౌన్సిలర్ శంకర్ నాయక్ అన్నారు. రెవెన్యూ డివిజన్ పేరిట మేడ్చల్ ప్రాంత ఆటో డ్రైవర్లు తమను అడ్డగిస్తున్నారని అన్నారు. తమకు న్యాయం చేయాలని ఆదివారం దుండిగల్ ప్రాంత ఆటో డ్రైవర్లు కౌన్సిలర్ శంకర్ నాయక్‌ను కలిశారు. ఒక పక్క మహిళలకు ఉచిత బస్సు సౌకర్యంతో తాము ఆర్థికంగా నష్టపోతున్నామని అన్నారు. మరో పక్క పాసింజర్లు ఎక్కించుకోకుండా మేడ్చల్ ప్రాంత ఆటో డ్రైవర్లు తమను ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆటోవాలాలు వాపోయారు. దీనిపై స్పందించిన కౌన్సిలర్ ఈ విషయమై కళాశాలల యాజమాన్యాలతో పాటు ఎమ్మెల్యేలు వివేకానంద్, రాజశేఖర్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.

మళ్లీ ఎన్నికల బదిలీలు..!

- పార్లమెంట్ ఎన్నికలకు సంబంధించిన ప్రక్రియలు పూర్తి చేయాలని ఎన్నికల సంఘం ఆదేశాలు
- మూడేళ్ల సర్వీసు పూర్తయిన పంచాయతీ రాజ్, జెడ్పీ, డీఆర్‌డీఏ ఉద్యోగుల బదిలీపై చర్చ
- ఎంపీడీఓలకు కూడా ట్రాన్స్‌ఫర్లు తప్పవని సమాచారం
- బదిలీపై శివారు జిల్లాల అధికార యంత్రాంగం కసరత్తు

సాక్షి, మేడ్చల్ జిల్లా: ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం అధికారుల బదిలీలకు మరోసారి రంగం సిద్ధమవుతోంది. గత అసెంబ్లీ ఎన్నికల్లో భాగంగా నగర శివారు మేడ్చల్-మల్కాజిగిరి, రంగారెడ్డి జిల్లాల్లో మూడేళ్ల సర్వీసు పూర్తి చేసుకున్న రెవెన్యూ, పోలీసు, పంచాయతీ రాజ్ విభాగాల్లో బదిలీలు జరిగాయి. మరో వైపు సర్వీసుతో సంబంధం లేకుండా సొంత జిల్లాలో వివిధ ప్రభుత్వ విభాగాల్లో పనిచేస్తున్న అధికారులు కూడా బదిలీ అయ్యారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో మరోసారి అధికారుల బదిలీల అంశం తెరపైకి వచ్చింది. కేంద్ర ఎన్నికల సంఘం ఎన్నికల ప్రక్రియకు సంబంధించిన అన్ని పనులు పూర్తి చేసుకుని సిద్ధంగా ఉండాలని సూచించడంతో... బదిలీల ప్రక్రియను వేగవంతం చేసేందుకు అధికార యంత్రాంగం సమాచారాన్ని సేకరిస్తోంది. అందులో భాగంగానే జిల్లా పంచాయతీ, జిల్లా పరిషత్, డీఆర్డీఏ విభాగాల్లో పనిచేస్తున్న జిల్లా అధికారులతో పాటు మరికొన్ని విభాగాల్లో పనిచేస్తున్న ఉద్యోగులు బదిలీ అయ్యే అవకాశాలు ఉన్నాయని రెవెన్యూ శాఖ వర్గాల్లో చర్చ సాగుతోంది. సదరు అధికారుల స్వస్థలం, ఎన్ని సంవత్సరాలుగా మేడ్చల్-మల్కాజిగిరి, రంగారెడ్డి జిల్లాల్లో పనిచేస్తున్నారు. ఉద్యోగ విరమణకు దగ్గరగా ఎవరైనా ఉన్నారా? లాంటి వివరాలను సేకరించి తుది నిర్ణయం తీసుకోనున్నారు.

మినహాయింపు దక్కేనా..

కలెక్టరేట్‌లలోని వివిధ విభాగాలకు పర్యవేక్షకులుగా తహసీల్దార్లు పనిచేస్తున్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో భాగంగా కొందరు బదిలీపై ఇక్కడి వచ్చారు. ఇక జిల్లాల్లో ఆయా మండలాల్లో ఇతర జిల్లాల నుంచి వచ్చిన వారు బాధ్యతల్లో కొనసాగుతున్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో మండల అభివృద్ధి అధికారులు (ఎంపీడీవో)లకు పోలింగ్ నిర్వహణలో ప్రత్యక్ష ప్రమేయం ఉండే అవకాశాలు లేకపోవడంతో వీరికి బదిలీల నుంచి మినహాయింపు లభించింది. కానీ సొంత జిల్లా, మూడేళ్ల సర్వీసు పూర్తి చేసుకున్న ఎంపీడీవోలను కూడా ఈ దఫా బదిలీ చేసే అవకాశాలు ఎక్కువగా ఉన్నట్లు తెలుస్తోంది. ఎన్నికల నిర్వహణలో అనుభవజ్ఞులైన అధికారుల అవసరం ఉంటుందన్న కారణంగా జిల్లాల్లో కొంత మంది అధికారులకు మినహాయింపు కూడా దక్కవచ్చని అధికార వర్గాల్లో చర్చ జరుగుతోంది.